**పుస్తక పరిచయం (ఏప్రిల్ 2009 రచన పత్రికలో– సాహితీవైద్యం శీర్షికకింద)**

# ‘ఇట్లు మీ విధేయుడు’

**రచన: భమిడిపాటి రామగోపాలం**

**పరిచయ వ్యాఖ్య:** వేదవ్యాసుడి మహాభారతమంత విస్తృతంగా, మధ్యతరగతి భారతాన్ని పాఠకుల ముందుంచిన అద్భుత ఆహ్లాద కథాకావ్యం ‘ఇట్లు మీ విధేయుడు’. అభిమానులు ముచ్చటగా భరాగో అని పిల్చుకునే సుప్రసిద్ధ రచయిత భమిడిపాటి రామగోపాలం శైలిలో- మునిమాణిక్యం సున్నితం, కొడవటిగంటి నిశితం, ముళ్ళపూడి సునిశితం- అద్భుతంగా సమ్మిళితం. హాస్యంలో విషాదాన్నీ, విషాదంలో హాస్యాన్నీ అవలీలగా ఇముడ్చుకుని జీవితాన్ని నవరసభరిత హాసంగా ప్రదర్శించిన ఈ కథల్లో- కేవలం హాస్యకథ అనతగ్గది ‘తడిసి మోపెడు’ మాత్రమే అనిపిస్తుంది. కథలన్నింట్లో వ్యంగ్యం అలరించినా కేవలం వ్యంగ్యకథ అనతగ్గది ‘వై-శ్వానర- భోగం’ మాత్రమే అనిపిస్తుంది. నిత్య జీవితానుభవాలని అవగాహన పెంచేలా విశ్లేషిస్తూ- సమస్యలకి పరిష్కారాల్ని కూడా స్ఫురింపజేసే (ఉదాహరణకి ‘సద్యోగం’) ఈ కథల్లో- సందేశం పాలలో వెన్నలా నిబిడీకృతం కావడం విశేషం. మనసు కలుక్కుమనిపించే (‘వై డోంట్యూ మారీ మి?’) కథలతో సహా అన్నీ ఆహ్లాదకరమనిపించగల ప్రత్యేకత భరాగో కథనానిది. అడుగడుగునా ఎదురై పలకరింపునే **అలరింపు చేసే అర్థవంతమైన వాక్యాల్లో మచ్చుకి కొన్ని:**

‘క్షణికమైన ఆధిక్యాన్ని పురస్కరించుకుని నిజమైన విలువని అవమానించిన దోషం తనది’,

‘వర్షాకాలపు ఎండేమో ఉక్కపోసి కితకితలు పెడుతోంది’,

‘ఎవరికెంత హీనమైనా బుచ్చి తన కథకి తనే నాయకురాలు’,

‘ద్వేషించడంలో ఒకరి సహాయం సులువుగా అంగీకరిస్తాం’,

‘వాతావరణంలా, వ్యసనంలా చుట్టూ వ్యాపిస్తాడు’,

‘కాలేజిలో ప్రవేశించింది కళ. కాలేజిలో కళ ప్రవేశించింది’,

‘వంటొచ్చిన మగాడైతే ఆడ లక్షణాలుంటాయనుకోకూడదు. ఆడవాళ్ళ హార్మోనులతో పుట్టాడనుకోకూడదు. అదొక నిజమైన కళ. అరవైనాలుగు కళలకీ అవకాశం ఇచ్చేది ఆహారం. దానిక్కారణం వంట అనే కళ. దానికివ్వవలసిన గౌరవం ఇవ్వడం మానేసి, అదొక చాకిరీకింద హీనపర్చేసిన ఈ దేశస్థులది తప్పు....’,

‘ఆదర్శం అంటే కూడా అందమైన, కష్టమైన అబద్ధమే’,

‘న్యూక్లియర్ ఫిజిక్సు న్యూ కావచ్చు కానీ క్లియర్ కాదుగా’,

‘తెల్లటి సినిమాస్కోపు తెర నల్లగా, పైన డిమ్‌లైటు నల్లగా, పక్కన కూర్చున్న అందమైన పద్మజ పలువరస నల్లగా, అంతులేని భవిష్యత్తంతా నల్లగా- అనిపించే అపశృతి’,

‘తప్పు చేసే మనిషి స్థాయినిబట్టి తప్పు పరిమాణం పెరుగుతుంది’,

‘మీనాక్షమ్మగారు ఇండెఫినెట్లీ లేటు నడుస్తున్న ట్రెయిన్‌లాంటివారు’,

‘అధికారులందరూ హీహీకారాలు చేసినా అతని మనస్సు హాహా కారాలే చేసింది’,

‘తీరిక ఉంటే సరదాగా ఉండగలడు కానీ సరదాకోసం తీరిక చేసుకోడు’,

‘దేశమంటే మనుషులే. కానీ దేశం సమస్య మనుషులది కాదు, మనుషుల సమస్యే దేశానిది’,

‘సర్రుమని డీఐజీగారి కారొచ్చి ఆగింది. అంతకంటే ఘోర్సుగా ఆయనా దిగారందులోంచి’,

‘భోజనానికి అవకాశం కుదరక ఉపవాసం’,

‘అది ఇల్లా, రామానాయుడి సినిమా సెట్టింగా’,

‘తనకి మూడు వందలవసరమై ఈ ఆడిట్ పెట్టింది’,

‘కుర్చీలో వెనక్కి చారబడి ఒక్కసారిగా ఆఫీసరైపోయాడు’,

‘ఇన్నాళ్ళకి నువ్వు కూడా ఓ బండివాడివయ్యేవన్న మాట’,

‘గాంధేయవాదికి కాని రోజులంటూ ఉండవు’,

‘మొల్లో మగతనపు చిహ్నముండి, చేతిలో మెట్రిక్యులేషన్ సర్టిఫికెట్టుంటే చాలు- లక్ష దాటుతోంది ఆశ’.

కథాంశం నేరమైనా సంసారపక్షం, శృంగారమైనా సెన్సారపక్షం. రచయిత ప్రత్యేకతని సూచించే- అర్థవంతమైన పేర్లు (శివాయ ఘ్లురూపాయ, తడిసి మోపెడు), వాతావరణం (పేజీ 296, పేరా 6; పేజీ 328లో కలెక్టరాఫీసు), వ్యాఖ్యానం (పేజీ 300, పేరా 3; పేజీ 382, పేరాలు 5,6); మనో విశ్లేషణ (గుండెలమీద కుంపటి); ప్రేమానుబంధం (పేజీ 286, పేరా 3); కథనం (మూడు గదులు), శిల్పం (వెన్నెల నీడ), పాత్రచిత్రణ (నా సుఖమే నే కోరుకున్నాలో రాజి), వర్ణనలు (పేజీ 288, పేరా 1; పేజీ 304లో లీలారాణి వరాలు)- సుసంపన్నం చేసిన ఈ సంపుటిలో- మిగతా కథల స్థాయి దృష్ట్యా సామాన్యమనిపించిన - ‘నీ పద్ధతి మార్చుకో’, ‘పృథ్వీపతి’, ‘మంచివాళ్ళు కూడా ఉంటారు’. మొత్తంమీద ఈ కథలు- ఒడ్డున అలల్లా అలరించి, మధ్యలో ఎంత లోతుకైనా తీసుకెళ్ళగల జీవిత సముద్రం. సంపుటికి బాపు ముఖచిత్రం కథల ఔన్నత్యాన్ని రచయిత వ్యక్తిత్వంలో ప్రతిబింబించింది. మధురాంతకం రాజారాం, చందు సుబ్బారావుల సమీక్షలు ఈ పుస్తకంలో చోటు చేసుకోని మరికొన్ని కథల్ని ప్రస్తా ంచాయి. వాడ్రేవు చినవీరభద్రుడి పరిచయవాక్యాలు

'కథకుని పరిణామా'న్ని ఉద్దేశించినా- కథలపట్ల కలిగించిన అవగాహన ప్రశంసనీయం. 'ఇట్లు మీ విధేయుడు' అనడం రచయిత వినయమైతే- పాఠకులు 'ఇట్లు మీ విధేయులు' అనడం రసానుభూతి. 'సద్యోగం' సోమర్‌సెట్ మామ్ కథనీ, 'శ్రీ ఆంజనేయమ్, ప్రసన్నాంజనేయమ్' మా 'రామనామం' కథనీ, 'వై-శ్వానర-భోగం' కొన్ని పాత కథల్నీ స్ఫురింపజేసినా- అవతార పురుషుల్లో రాముడికీ, గోపాలుడికీ ఉన్నంత భేదాన్ని కథారచనలో చూపి సార్థక నామధేయులయ్యారు రచయిత.

సంపుటిలోని కథల్లో మచ్చుకి నాలుగింటిని టూకీగానూ, 'జరిగిందే- కథ'ని సాహితీపథ్యంగానూ ఈ సంచికలో పరిచయం చేస్తున్నాం. ఈ సంపుటికి అవార్డునిచ్చి తన్ను తాను గౌరవించుకున్న కేంద్రసాహిత్య అకాడెమీకి అభినందనలు. రచయిత భమిడిపాటి రామగోపాలంకి సాహితీవైద్యం అభివందనాలు.

**క్షణభంగురమ్:** మాణిక్యం, భర్త ముప్ఫయ్యో పడిలో ఉన్న దంపతులు. పక్కింటి జంట అన్యోన్యతని- మాటల్లో స్పష్టంగా విని- వారిది లేత వయసనుకుంటారు. బాధ్యతల కారణంగా ఆ వయసులో తామలా ఉండలేకపోయామని దిగులు పడతారు. ఆ జంటలో ఇద్దరూ యాబయ్యేళ్ళు పైబడ్డవారని తెలిసేక, ఆ వయసులో అవేం బుద్ధులని అసహ్యించుకుంటారు.

**విశ్లేషణ:** మనం పొందనిది ఎదుటివారు పొందితే- వారిని అనుసరించడంవల్ల కలిగే సంతోషం శాశ్వతమైనది. కానీ అహం, అసమర్థత వారిని ఏవగించుకోమంటాయి. అందువల్ల కలిగే సంతోషం క్షణభంగురమైనా ఎక్కువమంది చేసేదదే. 'ఈ రోజుల్లో ఎవరు ముందుగా పరిచయం కోరితే- రెండోవాళ్ళు వాళ్ళమీద కొంచెం ఆధిక్యం వెలగబెడతారు', 'లోకంలో అన్ని బాధలకంటే ముసలివాళ్ళమయ్యామని ఒప్పుకునే బాధ దారుణం' వంటి వ్యాఖ్యలూ, రేడియోల కాలంలో వాతావరణం (పేజీ 66, పేరా 2)- శిష్టమైన ఈ రచనలో మనోవిశ్లేషణ వాస్తవమూ, ప్రయోజనాత్మకమూనూ. రచయితకి అభివందనాలు.

**త్రివర్ణచిత్రం:** కాలేజిలో సరళాదేవిని 'అనుకరిద్దామని ఆడపిల్లలూ, అనుసరిద్దామని మగపిల్లలూ' ఊరే రోజుల్లో రామకోటి ఆమెకి ప్రేమలేఖ వ్రాసాడు. 'ఆజన్మబ్రహ్మచారిణి మెస్ వార్డెన్- తనకలాంటిది ఒక్కటీ రాలేదన్న అక్కసుతో- అతణ్ణి డిస్మిస్ చేయాలంది'. కులం అడ్డొచ్చిందని- 'కావాలన్నప్పుడు కనికరించిన కన్నతల్లి కాకూడని సమయంలో కరుగ్గా ఐపోయి' అడ్వొకేటు ఆనందరావు సంబంధం తెస్తే, 'ఇరవై ఏళ్ళకి చేసినా తనది బాల్య వాహమే' అనుకుంది సరళ. ఆ తర్వాత కొన్నేళ్ళకి ఆనందరావు ఇంట్లోనే పై వాటాలోకి ఇన్‌కంటాక్స్ ఆఫీసరై వచ్చాడు రామకోటి. 'మొగ్గలోనే తుంచేసినా మోడై చిగురించగల ఆనందానుబంధాన్ని'- 'ఇలా పెళ్ళైపోగానే అలా అన్నయ్యగారూ అంటూ పిలవడం ప్రారంభించి' ఆరిపోనివ్వలేదు సరళ. రామకోటి

భార్య మూడో పురిటికి పుట్టింటికి వెళ్ళడంతో ఆ ముగ్గురూ ఎప్పుడూ కలిసే తిరిగేవారు. ఒకసారి తను లేనప్పుడు- చదరంగమాడుతూ సరళకి కంపెనీ ఇచ్చిన రామకోటిపై- 'పాలకోసం రాళ్ళు మోయాలి' అంటూ వ్యంగ్యాస్త్రం విసిరాడు ఆనందరావు. 'గుప్తంగా ఉండిపోయిన అశ్లీలాన్ని గుర్తించడమూ అశ్లీలమే' అని మౌనం వహించిన రామకోటికి 'ఆరోపణలో దూషణకంటే బలమైన శిక్షగా ఆఘాతాన్నిచ్చి' కొట్లాటకి పురిగొల్పాడు ఆనందరావు. అప్పుడు- 'త్రిభుజం మూడు బిందువులూ ఒకచోట కలిసి- నూట ఎనభై డిగ్రీలూ మూడొందల అరవై అయ్యాయి'. సరళలో 'తల్లీ, చెల్లీ, పెళ్ళాం, పిల్లా ఒక్కసారే చూపట్టగా' రామకోటి ఆనందరావుకి సపర్యలు చేసాడు. 'అవమానాల అవకాశాల మధ్య, నీతి అవినీతుల మధ్య'- 'తెంచుకోవడం మంచిదే కానీ సులభం కాదు, సులభమే ఐతే మంచిది కాదు' అనిపించేలా వారి బంధం కొనసాగుతూనే ఉంది.

**విశ్లేషణ:** భర్త, స్నేహితుడు- సహచరులైనప్పుడు ఆ స్త్రీ మనోభావాలు, ఆ ముగ్గురి ఆలోచనలు ఎలాఉంటాయో- అనన్యసామాన్యంగా ప్రదర్శించిన లక్షణమైన కథ. ముఖ్యంగా సరళపట్ల రామకోటి భావాల విశ్లేషణ (పేజి 141, పేరా 3) అపూర్వం. స్త్రీపురుష సంబంధాల్లో సంప్రదాయమొప్పని భావాల్ని- సామాన్యుడి అవగాహనకి అందే ఆధునిక దృక్పథంతో సమర్థవంతంగా వివరించిన గొప్ప కథ ఇది. రచయితకి అభివందనాలు.

**వై డోంట్యూ మేరీ మి?:** సుబ్బారావు తండ్రికి దగ్గు. తల్లికి బ్లడ్ ప్రెషర్. తమ్ముడింకా చదువుతున్నాడు. ఇద్దరు చెల్లెళ్ళ పెళ్ళి చేయాలి. వీళ్ళందరికోసం ఉద్యోగానికి కలకత్తా వెళ్ళాడు. అతడు ప్రేమించిన పద్మజ ఓ విద్యా సాగర్ని పెళ్ళి చేసుకుంది. దూరాన ఉన్నాడని అతడికి వేరే సంబంధాలు రావడంలేదు. 'అంతా బాగున్నాం అంటూ మొదలెట్టి ఎవరూ కులాసాగా లేమన్నట్లు తెలుస్తూ' తనకొచ్చే ఉత్తరాలు తల్చుకుని తనవాళ్ళంటే చిరాకుపడే అతణ్ణి- కలకత్తాలో కమలా మేనోన్ అనే కేరళ అమ్మాయి, 'వై డోంట్యూ మేరీ మి?' అంటూ ఆట పట్టించేది. ఉద్యోగిని ఐనా సంప్రదాయ గృహిణి లక్షణాలు లేని ఆమె- పేపర్లో ప్రకటన చూసి ఓ కేరళ అబ్బాయికోసం దరఖాస్తు పెట్టింది. సుబ్బారావు కూడా తన పేరు గోప్యంగా ఉంచి తెలుగు పేపర్లలో ప్రకటన ఇచ్చాడు. కమలకి కేరళ అబ్బాయి నచ్చలేదు. సుబ్బారావుకి- తన కుటుంబపు దీనస్థితి తెలియజేస్తూ, ఆ కుటుంబంకోసం పెళ్ళి వాయిదా వేసుకుంటున్న అన్నగారి మంచితనాన్ని పొగుడుతూ- ఒకే ఒక్క దరఖాస్తు పెట్టుకున్న అమ్మాయి అతడి చెల్లెలు వసంత. 'ఎటువంటి షాక్స్ ఇస్తుంది మన సాంఘిక వ్యవస్థ?' అంటూ అతణ్ణి ఓదార్చిన కమలా మేనోన్ని మొదటిసారిగా, 'వై డోంట్యూ మేరీ మి?' అనడిగాడు

సుబ్బారావు.

**విశ్లేషణ:** విషాదాన్ని హాస్యంగా మలచిన ఈ చిన్న కథలో- మనసు కలుక్కుమనిపించే ముగింపు- మన వ్యవస్థని ఊహాతీతంగా విశ్లేషించింది. రచయితకి సాహితీవైద్యం అభివందనాలు.

**ముద్ర:** బట్టలుతికే నారాయణ కొడుకు వెంకటాచలానికి- భారత నౌకాదళంలో దోభీ ఉద్యోగ మిప్పిస్తానంటే- ప్యూన్ పనైనా చేస్తానుకానీ కులవృత్తి చేయనని అందుకు కారణాలుగా రెండు సంఘటనలు చెప్పాడు. తర్వాత అతడికి ప్యూన్ ఉద్యోగం దొరికినా- అధికారి ఇంట కులవృత్తి తప్పలేదు. బట్టలుతకడంలో అతడికున్న ప్రావీణ్యంవల్ల ఆ అధికారి అతడికి గుమస్తాగా ప్రమోషన్ రానివ్వడంలేదు. బట్టలుతికే పనిలో నిర్లక్ష్యం చూపిస్తే- అక్కణ్ణించి మోక్షం లభించొచ్చు కానీ- అతడి స్వభావంలో ఉన్న బేసిక్ మోరల్ అలా చెయ్యనివ్వడంలేదు.

**విశ్లేషణ:** శ్రమ విభజనకి కుల తత్వానికి మించిన వ్యవస్థ లేదు. కులాల పేరిట సంఘటితమౌతున్న శక్తుల బలం కొత్త సహస్రాబ్దాన్ని కూడా ప్రభావితం చేయడం గమనార్హం. ఐతే కులవృత్తిని వ్యక్తిత్వంతో ముడిపెట్టి 'ముద్ర' వేసే మనస్తత్వాల కారణంగా- ఆ వ్యవస్థ ఈసడింపుకి గురైంది. అందుకే కథలో వెంకటాచలం చెప్పిన రెండు సంఘటనలూ- (పేజి 399, పేరా 8; పేజి 400, పేరా 1) రచయిత సునిశిత పరిశీలనకి మచ్చుతునకలు. నైతిక విలువలకి ప్రాధాన్య మిచ్చే వెంకటాచలం పాత్రచిత్రణలోని వాస్తవికత ఎందరికో స్వానుభవం. కులాన్ని పర కుల ద్వేషానికి కాక కులవృత్తి వికాసానికి సంఘటితం చేయాలనీ, లేని పక్షంలో కులాన్నే పూర్తిగా విస్మరించాలనీ- స్ఫురింపజేసే లోతైన కథ ఇది. రచయితకి అభివందనాలు.

# సాహితీపథ్యం

కృష్ణయ్యని మేనేజింగు డైరెక్టరుగారు 'డై చేయమంటే' వెళ్ళాడు. రిలాక్సింగ్ సోఫాసెట్లో కూర్చుని అతణ్ణీ కూర్చోమన్నారాయన. కాలితో బెల్ నొక్కితే 'జపనీస్ క్రైమ్స్ ఇంపైన చప్పుడుతో మోగాయి'. వచ్చిన దర్వాన్‌కి- కాసేపు లోపలికెవర్నీ పంపొద్దని కరుగ్గా చెప్పి పంపేసారు. తనో సిగరెట్ వెలిగించి- కృష్ణయ్యకి కూడా  ఆఫర్ చేసి, 'బిగుసుకుపోయి కూర్చోవలసిన అవసరంలేదు. ఇక్కడ మీకెవ్వరూ ఫోటో తియ్యరు' అన్నారు. ఆఫీసుకి ఆలస్యంగా వస్తాడనీ, వచ్చేక రోజుకి మూడే గంటలు పని చేస్తాడనీ, అందులో నూటఇరవయ్యారు నిముషాలు టెలిఫోన్లో మాట్లాడతాడనీ- తన అభియోగాల్ని మర్యాదగా  నిపించారు. వాటిని నమ్మడానికి తనకి ఖచ్చితమైన ఆధారాలున్నాయి కాబట్టి సంజాయిషీ అక్కర్లేదన్నారు. వేరే ఆఫీసులో ఉద్యోగానికి వచ్చిన ప్రకటన చూపించి- దరఖాస్తు పెట్టుకోమన్నట్లు సూచించారు. మరో సిగరెట్ వెలిగించారు కానీ ఇక కృష్ణయ్యకి ఆఫర్ చెయ్యలేదు.

కృష్ణయ్య ఆఫీసొదిలి వెళ్ళిపోతుంటే- 'ఫొటోలు తీసారు. దండలు వేసారు. సన్మానపత్రాలు చదివారు. ఒకళ్ళిద్దరు ఫొటోలకు, సన్మానపత్రాలకు అద్దాలు కట్టించి ఇచ్చారు. ఆఖరు రోజున సాంస్కృతిక కార్యక్రమం ఏర్పాటు. కళాకారులకు అతడి శ్రీమతిచేత మెమొంటోల బహూకృతి. ఆ దంపతులిద్దర్నీ కళాకారులతో చేర్చి గ్రూప్ ఫొటో. గొప్ప వేడుక జరిగింది. వారం రోజులు డిన్నర్లతో పార్టీలతో ఊపిరి సలపలేదు'.

ఊరొదిలి వెళ్ళేముందు కృష్ణయ్య భార్యతో బీచికి వెళ్ళాడు. అక్కడ పిడతకింద పప్పు అమ్మేవాణ్ణి మాటల్లో పెట్టి- అతగాడు తన కంపెనీలోనే షిఫ్టు డ్యూటీమీద పని చేస్తున్నాడనీ- డ్యూటీ లేనప్పుడిలా వ్యాపారం చేస్తాడనీ గ్రహించాడు. తననతడు గుర్తు పట్టలేడని గ్రహించేక- కృష్ణయ్య గురించి అతడేమనుకుంటున్నాడో అడిగాడు. 'ఆ బాబు జండా దిగిపోనాది. మంచాడే. తను పని జోలికెళ్ళడు. ఉంకోలు పన్జేత్తన్నారా అని సూడ్డు. అంత మంచిని ఎన్నాల్లు సాగనిత్తారు? ఎండీబాబు నిగా ఏస్సినాడు. ఇక్కడుండకుండా సేసీసినాడు' అన్నది అతడి మాటల సారాంశం. కృష్ణయ్య 'చక్కెరవలె, చుక్కలవలె, కర్పూరపు ముక్కలవలె- నా కీర్తి చూడు' అన్నట్లు తన భార్యవంక గొప్పగా చూసి, 'ఆయనెవడయ్యా అతన్నిక్కడుండకుండా చేసేడానికి? కృషయ్యకే ఇంకోచోట మంచి ఉద్యోగం వస్తే పోతున్నాడేమో!' అన్నాడు.

అప్పుడు పిడతకింద పప్పు అమ్మేవాడు, 'ఏట్నేదు బాబూ. ఓ రోజు మామూలుగా ఆఫీసుకెల్లాడట మా కృష్ణయ్య బాబు. ఎండీ బాబేమో, ఈ బాబుని పిలమన్జెప్పి, కూకోబెట్టి- ఏటయ్యా కిష్టయ్యబాబూ- ఇక్కణ్ణిండీ తప్పుకుంతావా, బొక్క సింపేమంతావా- అని అడిగినాడు. నేదుబాబూ నానే తప్పుకుంతానం చెప్పి ఈ బాబుంకో ఉద్దోగం సూసుకోనెల్లిపోతున్నాడు' అన్నాడు.

'బాగా చెప్పాడు- చూసి, వినీసిన వాళ్ళాగ. జరిగిందాన్నే వాడి భాషలో చెప్పాడు' అన్నది ముగింపు వాక్యం.

అతి సామాన్యమైన ఇతివృత్తం. అనన్యసామాన్యమైన కథనం. అసామాన్యమైన కథ. క్లుప్తంగా ఇదీ 'జరిగిందే- కథ'. 1978 నవంబర్లో జ్యోతి మాసపత్రికలో వచ్చిన ఈ కథకి 'ఇట్లు మీ విధేయుడు' భమిడిపాటి రామగోపాలం- తన కథాసంపుటిలో స్థానమిచ్చారు. కృషయ్య పని తీరు, అతడితో పై అధికారి వ్యవహరించిన తీరు, కృష్ణయ్యకి వీడ్కోలు లభించిన తీరు, పిడతకింద పప్పు అమ్మేవాడి వ్యక్తిత్వం, కృష్ణయ్య గురించి అతడు చెప్పిన తీరు- మన ఆఫీసు వ్యవస్థని విశ్లేషించే పట్టకాలు. అసలుసిసలు ఆహ్లాదకర కథకి నిర్వచనమై- ఎత్తుగడ, పాత్రచిత్రణ, సన్నివేశ కల్పన, భాష- పరంగా ఔత్సాహికులు అధ్యయనం చేయాల్సిన కథ ఇది. రచయితకి సాహితీవైద్యం అభివందనాలు.

() () () () ()